క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ఆత్మకూరు: తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అనుచరుడైన మెట్టుకూరు సీఎంను కలవడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. ఆయన ఆనంను వీడనున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు



కొండాపురం : స్థానిక బోయలవారిపాళెం ఎంపీపీ పాఠశాలలో వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద వృద్ధులకు ఉచిత కంటి వైద్య పరీక్షలను సోమవారం నిర్వహించారు. కంటి వైద్యాధికారి వెంకటసుబ్బయ్య కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్లు అవసరమైన వారినికి ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. కంటి అద్దాలు అవసరమైన వారికి అందజేస్తామన్నారు.

సన్మానం



దుత్తలూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న సచివాలయ సిబ్బందిని సోమవారం ఘనంగా సన్మానించారు. సోమలరేగడ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ కే హరిబ్రహ్మయ్య, సర్వేయర్ వై సత్యనారాయణ, సెరీకల్చర్ అసిస్టెంట్ మమతను శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ సాయిప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణపై శిక్షణ

జలదంకి: స్థానిక పశువైద్యశాలలో పశువైద్యాధికారి ప్రవీణ్ ఆధ్వర్యంలో వెటర్నరీ అసిస్టెంట్లకు కృత్రిమ గర్భధారణపై శిక్షణా తరగతులను సోమవారం నిర్వహించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఐదు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని పాడి రైతులకు 35 టన్నుల సమీకృత దాణాను అందజేసినట్లు చెప్పారు. దాణా కావాల్సిన పాడిరైతులు పశువైద్యశాలలో సంప్రదించాలని కోరారు. వెటర్నరీ అసిస్టెంట్లు ఎస్ కోటయ్య, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

సోమశిల: ప్రపంచ మానవ హక్కుల సంఘం డైరీ, క్యాలెండర్లను సోమశిల ప్రాజెక్ట్ ఎస్సై భోజ్యానాయక్ సోమవారం ఆవిష్కరించారు. ప్రపంచ మానవ హక్కుల సంఘం ఆత్మకూరు వర్కింగ్ చైర్మన్ కానకాల వెంకటేశ్వర్లు, ఆత్మకూరు చైర్మన్ పీ ప్రసాద్ మర్రిపాడు మహిళా చైర్మన్ కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి

ఉదయగిరి: పంచాయతీ కార్యదర్శులు మార్చి నెలాఖరుకు ఇంటి పన్నులను నూరు శాతం వసూలు చేయాలని కావలి డీఎల్‌పీఓ ఆదినారాయణ ఆదేశించారు. మండలంలోని శకునాలపల్లి, పుల్లాయపల్లి గ్రామాల్లోని సచివాలయాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈఓపీఆర్డీ మల్లికార్జున, సీనియర్ అసిస్టెంట్ నయీం, పంచాయతీ కార్యదర్శులు తేజ, కరీముల్లా పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణంలో అగ్నిప్రమాదం

ఆత్మకూరు: పట్టణంలోని సోమశిల రోడ్ సెంటర్‌లోని ఎలక్ట్రికల్ అండ్ హార్డ్‌వేర్ సామగ్రిని విక్రయించే జయగోపాల్ ఎంటర్‌ప్రైజస్ లో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అటుగా వెళ్తున్న వారు గమనించి షాపు యజమానికి సమాచారం అందజేశారు. దుకాణ యజమాని అందించిన సమాచారంతో ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్షకు పైగా విలువైన సామగ్రి దగ్ధమైనట్లు సమాచారం.

వాహనాల తనిఖీ

ఉదయగిరి: ఎస్పీ విజయారావు ఆదేశాల మేరకు పట్టణంలో సీఐ గిరిబాబు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతిఒక్కరూ వాహన, డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, లేకపోతే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, పరిశీలకుడు గురుమోహన్‌ను సత్కరిస్తున్న సీహెచ్ ఆదిశేషయ్య

ఆత్మకూరు: వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి బాటలు వేయాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో పట్టణ, మండల వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గురుమోహన్‌తో కలిసి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. వాటిని పరిశీలించేందుకు మన రాష్ట్రానికి ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు వస్తున్నాయంటే వాటి గొప్పతనం అర్థమవుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఎలాంటి ఉద్యోగాలు లేక యువత నిరుత్సాహంగా ఉన్న క్రమంలో జగనన్న సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పించిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సేవాభావంతో పనిచేసే వలంటీర్లతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులకు అందుతున్నాయన్నారు. మేనిఫెస్టోను పూర్తి స్థాయిలో అమలు చేసిన జగనన్న రానున్న ఎన్నికల పరీక్షలో నెగ్గడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు గురుమోహన్‌ను సీహెచ్ ఆదిశేషయ్య, శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు వెంకట రమణమ్మ, కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, ఎస్సీసెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, రూరల్ జేసీఎస్ కన్వీనర్ రాజేంద్ర నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ జితేంద్రనాగ్‌రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ఐవీ రమణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



గడప గడపకు మన ప్రభుత్వంపై సమీక్షిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

ఆత్మకూరు: ప్రభుత్వ ఆశయం మేరకు అర్హులందరికీ నవరత్నాల పథకాలు అందించేందుకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని 6,10 వార్డుల సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వంపై సోమవారం కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు అందిన అర్జీలు, వాటి పరిష్కారాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సచివాలయంలో స్పందన నిర్వహించి, వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు నిర్ణీత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, డీటీ రాజేష్, టీపీఓ చంద్రశేఖర్, కౌన్సిలర్ త్రివేణి, జయపాల్‌రెడ్డి, శ్రీకాంత్, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

రేపు గృహసారథులకు శిక్షణ

సోమశిల: అనంతసాగరంలోని నేషనల్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు గృహసారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాపూరు వెంకటసుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గురుమోహన్ హాజరవుతారని చెప్పారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

10 నుంచి వెంగమాంబ సముద్రస్నాన మహోత్సవాలు

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు సముద్రస్నాన మహోత్సవాలను ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఉషశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న రాత్రి నర్రవాడలో రథోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. 11న ఉదయం 8 గంటలకు అమ్మవారు ఊరేగింపుగా బయల్దేరి దుత్తలూరు, వింజమూరు, కలిగిరి, జలదంకి మీదుగా రాత్రికి కావలి శివాలయానికి చేరుకుంటుందని వివరించారు. 12న కొత్తసత్రం సముద్రతీరంలో సముద్ర స్నానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

సంగం: తలుపూరుపాడు పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ తలుపులు తెరిచి హుండీలోని నగదుతో పాటు వెండి వస్తువులను దుండగులు అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం ఆలయ అర్చకుడు చోరీని గుర్తించారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదుతో పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో ఆదివారం రాత్రి పెళ్లి ఊరేగింపులో ఏర్పాటు చేసిన డీజే విషయంలో ఇరువర్గాల మధ్యన నెలకొన్న వివాదం ఘర్షణకు దారి తీయడంతో ఒకరు గాయపడ్డారు. వివరాలు.. ఏఎస్ పేట దర్గా ప్రాంతానికి చెందిన సలీం వివాహ వేడుక సందర్భంగా ఆదివారం రాత్రి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే విషయమై స్థానికులు, పెళ్లి కుమారుడి బంధువుల మధ్యన వివాదం తలెత్తింది. ఈ క్రమంలో స్థానికులు, పెళ్లి కుమారుడి బంధువులు ఘర్షణకు దిగడంతో నరేష్ అనే యువకుడు గాయపడ్డాడు. గాయపడిన నరేష్‌ను వైద్యశాలకు తరలించారు. ఎస్సై నరేష్ ఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఈ విషయమై ఎవరూ ఫిర్యాదు చేయలేదని, ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని ఎస్సై నరేష్ తెలిపారు.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

- రెండు దుకాణాలపై 6ఏ కేసులు నమోదు



వరికుంటపాడులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వరికుంటపాడు: మండలంలోని రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. వరికుంటపాడులోని 22వ నంబర్ దుకాణంలో సుమారు 20 బస్తాలకు పైగా రేషన్ బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. తూర్పుబోయమడుగులలోని 18వ నంబర్ దుకాణంలో 3వేల కేజీల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో రెండు దుకాణాలపై 6ఏ కేసు నమోదు చేసి సరుకులు సీజ్ చేసి కందుకూరు డివిజన్ డిప్యూటీ తహసీల్దార్‌కు సరెండర్ చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమర్షియల్ అధికారి విశ్వారావు తెలిపారు.

ఉదయగిరి: పట్టణంలోని పౌరసరఫరాల గోదాము, రెండు చౌక దుకాణాలను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. విజిలెన్స్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఏఈ వెంకటరెడ్డి రికార్డులను తనిఖీ చేసి సరుకుల నిల్వలను పరిశీలించారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

బిట్రగుంట: మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గోవిందరావు అధ్యక్షతన జరిగిన ఎన్నికల ప్రక్రియలో నూతన అధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీప్రసన్న, కార్యదర్శిగా కొండయ్య, సంయుక్త కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా కేవీ రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆధార్ స్పెషల్ క్యాంపులు

ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెం, బట్టేపాడు సచివాలయాల్లో మంగళవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఆధార్‌కు సంబంధించిన అన్ని సేవలను కేంద్రాల్లో పొందవచ్చని, మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అల్పాహారానికి నగదు వితరణ

వింజమూరు: గుండెమడకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు స్టడీఅవర్స్‌లో అల్పాహారాన్ని అందించేందుకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ సోమవారం రూ.40 వేల నగదు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం గోపిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి నగదు అందజేశారు. ట్రస్ట్ మేనేజర్ మధురెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎస్సార్‌కు ఘన నివాళి

ఆత్మకూరు: మాజీ ఎమ్మెల్యే బీ సుందరరామిరెడ్డి తృతీయ వర్ధంతిని పట్టణంలోని ఆయన నివాసంలో సోమవారం నిర్వహించారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు హాజరై బీఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్యుడిగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా బీఎస్సార్ ప్రజలకు అందించిన సేవలను స్మరించుకున్నారు.

భూఆక్రమణలపై ఆందోళన

వింజమూరు: శంఖవరంలోని వాగు పోరంబోకు, ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించాలని గ్రామస్తులు కోరారు. శంఖవరంలోని కొందరు ఎన్నో ఏళ్లుగా రోడ్డుపక్కన పేడదిబ్బలు వేసుకుంటుండగా, వాటిని ఆక్రమణలుగా పేర్కొంటూ ఓ వర్గానికి చెందిన కొందరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొందరు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ భూఆక్రమణలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా శంఖవరం పంచాయతీలో పొలాలను కన్వర్షన్ చేయకుండానే ఇళ్లు నిర్మించారు. ఎన్నో ఏళ్లుగా పంచాయతీ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పంచాయతీ పరిధిలోని సుమారు 300 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. వాగు పోరంబోకు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవడంతో పశువులు మేపేందుకు స్థలం లేక పశుపోషకులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. భూ ఆక్రమణలపై పత్రికల్లో కథనాలు సైతం వచ్చినా రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకోకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 2017లో మండలంలోని వెంకటాద్రిపాళెంలో ఏడుగురి పేర్ల మీద పట్టా ట్యాంపింగ్ జరిగినా ఇప్పటికీ అధికారులు వాటిని ఆన్‌లైన్ అడంగల్ నుంచి తొలగించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై చర్యలు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

మర్రిపాడు: మండలం బూదవాడ పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మంగళ, బుధవారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి సోమవారం తెలిపారు. తొలుత నూతన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభిస్తారని చెప్పారు. బ్రాహ్మణపల్లిలో మంగళవారం ఉదయం 11 గంటలకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. మండలంలోని సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకావాలని కోరారు.

10,11న కేంద్ర బృందం పర్యటన

ఉదయగిరి: మండలంలోని దాసరుపల్లి, చెర్లోపల్లి, బండగానిపల్లి పంచాయతీల్లో ఈ నెల 11,12 తేదీల్లో కేంద్ర బృందం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుతీరుతో పాటు ప్రజల జీవనోపాధులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. మండలాధికారులు అందుబాటులో ఉండాలని కోరారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

వరికుంటపాడు: గణేశ్వరపురంలో వైద్యాధికారిణి కరీష్మా ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను సోమవారం అందజేశారు. దీర్ఘకాలిక, సాధారణ వ్యాధులతో బాధపడుతున్న 35 మందిని పరీక్షించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

జ్వరంతో ఇంటర్ విద్యార్థి మృతి

ఉదయగిరి: మండలంలోని ఆర్లపడియ పంచాయతీ కోటాయపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థి జ్వరంతో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. వివరాలు.. ఆర్లపడియకు చెందిన తంగిశెట్టి కిరణ్(17) ఉదయగిరిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గత పది రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఉదయగిరి, పామూరులోని ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స అందిస్తున్నారు. రెండ్రోజుల క్రితం జ్వరం తీవ్రత అధికం కావడంతో పాటు కామెర్లు సోకడంతో కుటుంబ సభ్యులు వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. కిరణ్ అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బిట్రగుంట: బోగోలు సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీలైన్ పనుల కారణంగా మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ నాగూర్‌వలి సోమవారం తెలిపారు. బోగోలు, విశ్వనాథరావుపేట, చెంచులక్ష్మీపురం, కొండబిట్రగుంట, పాతబిట్రగుంట, నాగులవరం, ఏబీకండ్రిగ, చెన్నారెడ్డిపాళెం, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కుష్టు సర్వే పరిశీలన

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులో వైద్యారోగ్య సిబ్బంది చేపడుతున్న కుష్టు సర్వేను వరికుంటపాడు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రాజశేఖరరాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ వరకు కుష్టు సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. కుష్టును ప్రాథమిక దశలో గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చన్నారు. ఆరోగ్య, ఆశాకార్యకర్తలు ఇంటింటిని సందర్శించి చర్మం పాక్షికంగా లేదా పూర్తిగా స్పర్శ కోల్పోవడంతో పాటు చర్మం రాగి రంగు మచ్చలు, తదితర లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పీహెచ్‌సీకి తరలించాలని సూచించారు.

గృహ నిర్మాణాల లక్ష్యాన్ని సాధించాలి

- కావలి ఆర్డీఓ శీనానాయక్



గృహనిర్మాణాలపై సమీక్షిస్తున్న ఆర్డీఓ వీకే శీనానాయక్

కావలి: పట్టణ పరిధిలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల లక్ష్యాన్ని ఉగాది నాటికి పూర్తి చేసేందుకు సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్ అన్నారు. కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ఆదేశాల మేరకు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మున్సిపల్, గృహ నిర్మాణశాఖ అధికారులతో గృహ నిర్మాణాలపై సోమవారం ఆర్డీఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఉగాది నాటికి కావలి అర్బన్ పరిధిలో 1324 ఇళ్లను ప్రారంభించాల్సి ఉందన్నారు. రానున్న 40 రోజులు కీలకంగా భావించి నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణాలను పూర్తిచేసేందుకు అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సచివాలయ సిబ్బంది తమ సచివాలయాల పరిధిలో మంగళవారం లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. కావలి మున్సిపల్ కమిషనర్ బీ శివారెడ్డి, గృహనిర్మాణశాఖ, మెప్మా, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత

కొండాపురం: ఇంటి నుంచి తప్పిపోయి కొండాపురానికి చేరుకున్న గొట్టిగుండాలకు చెందిన మతిస్థిమితం లేని బాలుడ్ని సోమవారం పోలీసులు క్షేమంగా తల్లికి అప్పగించారు. గొట్టిగుండాలకు చెందిన భువనేశ్వరి కుమారుడు వెంకటేష్‌కు మతిస్థిమితం లేదు. సోమవారం ఆటోలో కొండాపురానికి చేరుకుని అనుమానాస్పదంగా తిరుగుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు బాలుడ్ని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. గొట్టిగుండాల గ్రామానికి చెందిన వెంకటేష్‌గా గుర్తించి తల్లికి అప్పగించినట్లు ఎస్సై ఖాజావలి తెలిపారు.

కలప లారీ పట్టివేత

ఉదయగిరి: సీతారామపురం మండలం బసినేనిపల్లి నుంచి ఉదయగిరికి వేపకర్రను అక్రమంగా తరలిస్తున్న లారీని నేలటూరు సమీపంలో జిల్లా అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. లారీని ఉదయగిరి రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డికి అప్పగించారు. కలపకు ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి దుత్తలూరు పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జరిమానా విధిస్తామని ఉదయగిరి రేంజ్ అధికారి తెలిపారు.

హైవే నిర్మాణానికి సేకరించే భూములకు నష్టపరిహారం

చేజర్ల: 67వ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వ నిర్ణయించిన మేరకు నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని తహసీల్దార్ బీ కృష్ణయ్య తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోనున్న చిత్తలూరు, కాకివాయి గ్రామాల రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. హైవేలో భూములు కోల్పోనున్న రైతుల డాక్యుమెంట్లను పరిశీలించి, నష్టపరిహారంపై చర్చించారు. ఈ నెల 7న ఏటూరు, 8న నాగులవెలటూరు గ్రామాల రైతులతో భూసేకరణపై సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. డీటీ విజయ్, ఆర్ఐ కే సుమతి, వీఆర్వోలు ఎం హరీష్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు

ఉదయగిరి: మండల పరిషత్ కార్యాలయంలో 50 మంది దివ్యాగులకు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సోమవారం బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. దివ్యాంగుల సంఘ నాయకురాలు ఏ రమణమ్మ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై పరిశీలన



లబ్ధిదారులతో ముచ్చటిస్తున్న కేంద్ర బృందం

కావలి: మండలంలోని గౌరవరం, సర్వాయపాళెం పంచాయతీల్లో కేంద్ర బృందం సోమవారం పర్యటించింది. జాతీయ మూల్యాంకన కమిటీ ప్రిన్సిపల్ కోఆర్డినేటర్ అంబటి శ్రీనివాస్, కోఆర్డినేటర్ కిరణ్ క్షేత్రస్థాయిలో ఉపాధిహామీ, రైతుభరోసా, జలజీవన్ మిషన్, పెన్షన్లు, అంగన్‌వాడీ, మాతృవందన, తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరును పరిశీలించి, లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. వారి వెంట ఆర్డీఓ శీనానాయక్, ఏపీడీ నిర్మలాదేవి, తహసీల్దార్ మాధవరెడ్డి, ఎంపీడీఓ వెంకటసుబ్బారావు, క్లస్టర్ ఏపీడీ బృందం, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం



వరికుంటపాడులో క్షేత్రప్రదర్శన నిర్వహిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఉదయగిరి: చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తోందని, ప్రస్తుతం వాటి సాగు ద్వారా రైతులు మంచి లాభాలు పొందవచ్చని ఆత్మ పీడీ శివన్నారాయణ పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి, సీతారామపురం మండలాల మహిళా రైతులకు చిరుధాన్యాల సాగుపై సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రాగి, సజ్జ, కొర్రలు, ఊబలను తక్కువ పెట్టుబడి, తక్కువ నీటి వినియోగంతో పండించవచ్చని తెలిపారు. జీవనశైలిలో వస్తున్న మార్పులతో ప్రజలు ఆరోగ్యంపై అధిక శ్రద్ధ చూపిస్తూ చిరుధాన్యాలను ఆహారం తీసుకుంటుండడంతో వాటికి మంచి డిమాండ్ ఏర్పడిందన్నారు. దీంతో చిరుధాన్యాలు మంచి ధరలు పలుకుతున్నాయని వివరించారు. ఏడీఏలు లక్ష్మి, మాధవి, బాలాజీ నాయక్, వ్యవసాయాధికారులు చెన్నారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


నువ్వు సాగులో మెళకువలు పాటించాలి

వరికుంటపాడు: నువ్వు పంట సాగులో రైతులు మెళకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు లలిత, శివజ్యోతి, మల్లికార్జున అన్నారు. వరికుంటపాడు రైతుభరోసా కేంద్రం పరిధిలో సాగుచేసిన నువ్వు పంటను సోమవారం వారు పరిశీలించారు. నువ్వు పంటలో వెర్రితెగులు ఉన్నట్లు గుర్తించి సస్యరక్షణ చర్యలు సూచించారు. ఏఓ కిరణ్, వీఏఏలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

శనగ పంట పరిశీలన

కొండాపురం : మండలంలోని సాయిపేట పంచాయతీలో శనగ పంటను ఏఓ ప్రసూన సోమవారం పరిశీలించారు. రైతులకు సస్యరక్షణ చర్యలు సూచించారు. ఈక్రాప్‌లో నమోదు చేసిన రైతుల పంటలను పరిశీలించారు. రైతులు సెల్‌ఫోన్లలో ఆర్బీకే ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకుంటే ప్రభుత్వ పథకాలు, పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఆమె వెంట ఏఈఓ కందుకూరి ఈశ్వరాచారి, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవినాయక్

సంగం: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలతో నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరైనా మత్తుపదార్థాలు తీసుకుంటుంటే వెంటనే 14500 టోల్‌ఫ్రీనంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మాల్యాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.